యూనిట్ II

# 7. అజంతా చిత్రాలు

- నార్ల వేంకటేశ్వర రావు

## ఆలోచించండి - చెప్పండి



1. పై చిత్రంలో ఎవరెవరు ఉన్నారు? ఏం చేస్తున్నారు?
2. విహారయాత్ర అంటే ఏమిటి? ఎందుకు వెళతారు?
3. ఒక అందమైన ప్రదేశాన్నో దృశ్యాన్నో చూసినప్పుడు మనకు ఏమనిపిస్తుంది?

### ఉద్దేశం

భారతీయ చరిత్ర, సంస్కృతులను ప్రతిబింబించే ప్రాచీన కట్టడాలెన్నో అజ్ఞానం, నిర్లక్ష్యం, స్వార్థాల వల్ల పాడైపోతున్నాయి. వీటి ప్రాధాన్యాన్ని, పరిరక్షించుకోవాల్సిన ఆవశ్యకతను తెలియజేయడం ఈ పాఠం ఉద్దేశం.

**ప్రస్తుత పాఠ్యభాగం నార్లవేంకటేశ్వరరావు రచించిన 'నార్లరచనలు' ఐదవ సంపుటి లోనిది.**

### విద్యార్థులకు సూచనలు

1. పాఠం చదవండి. పదపట్టిక చూసి పదాలకు అర్థాలు తెలుసుకోండి.
2. సందర్భానికి తగిన అర్థాలు గ్రహించి చిత్రాల ఆధారంగా పాఠం భావాన్ని గ్రహించండి.
3. అర్థంగాని విషయాల గురించి మొదట జట్టులో చర్చించండి. తర్వాత ఉపాధ్యాయుడితో చర్చించి అవగాహన పెంచుకోండి.

చూసిన ఒక దృశ్యాన్ని వర్ణించడం సులభమేమో కాని, జీవించిన ఒక అనుభూతిని వర్ణించడం సులభమా? ఇరుకు కొంప నుంచి కదిలి, ఇరుకు బజార్ల వెంట నడిచి, అపారమైన సముద్రపు అంచున నిలిచినప్పుడు మనం పొందే అనుభూతిని వర్ణించడం సులభమా? మన పరిమిత జీవితాలలో, తల ఎత్తి అనంతాకాశంలోని అనంతకోటి నక్షత్రాలను పరికించగానే మనం పొందే అనుభూతిని వర్ణించడం సులభమా ?

పచ్చని చెట్టుగాని, పచ్చిక బయలుగాని చెదురుగా కానవచ్చే బస్తీలో బతుకుతూ, గాలికి తలలు కెరటాల్లా లేచిపడుతూండగా, దిశ్చక్రాన్ని అంటుతున్నట్టు కానవచ్చే పచ్చని వరిచేలను చూసినప్పుడు కలిగే అనుభూతిని వర్ణించడం సులభమా?

హృదయాన్ని ఊపే ఏ అనుభూతినీ, జీవితాన్ని కదిలించే ఏ అనుభూతినీ సులభంగా వర్ణించలేము.

ఇటీవలనే అజంతా, ఎల్లోరాలను చూసి వచ్చిన నన్ను ఏమి చూసి వచ్చినావని మిత్రులడిగినప్పుడు నేను వారికి సులభంగా గాని, సవిస్తరంగా గాని సమాధానం చెప్పలేకపోవడానికి నేను ఆ దృశ్యాన్ని చూసి రావడం కాక, ఆ అనుభూతిలో జీవించిరావడమే కారణమై ఉండాలి.

జల్గామ్‌కు దక్షిణంగా 35 మైళ్ళ దూరాన, ఔరంగాబాద్‌కు ఉత్తరంగా 55 మైళ్ళ దూరాన అజంతా గుహలున్నాయి. వాటి పరిసర ప్రాంతాల ప్రకృతి సౌందర్యాన్ని చూస్తే అజంతా గుహలలోని భారతీయ చిత్రకళ అంతకు ముందుగాని, అటు తర్వాత గాని అందుకొననంతటి మహోన్నత శిఖరాలను అందుకొనగలగడానికి ఒక ముఖ్యకారణం స్పష్టం కాకపోదు.

గుహలను సమీపిస్తుంటే, ఇటు పచ్చని కొండ అటు పచ్చని కొండ – ఈ రెండు కొండల మధ్య వాఘోరానది. రాళ్ళ గుట్టల గుండా జలజల ప్రవహిస్తూ నది పాడుకునే పాటలను వింటూ, నది అంచువెంట కాలినడకన, గుహలకు చేరాలి.



మీ పైన నీలాకాశం, మిమ్ము అలరిస్తూ అడవి పువ్వులు, మిమ్ము ఆవరిస్తూ ఆ పువ్వుల కమ్మని నెత్తావులు. గుహలను చేరే వరకు రెండు, మూడు మెలికలను కాబోలు మీరు తిరుగుతారు. ఏ మెలికలో అడుగుపెడితే, దానికి అదే ఒక ప్రపంచం.



ఇటు కొండ – అటు కొండ – ముందు కొండ – వెనుక కొండ – పైన కొండ – పక్కనే నది – నీలాకాశం – నీలాల నీళ్ళు – పచ్చని చెట్లు – కమ్మని తావులు – అది వేరే ప్రపంచం – అదొక స్వాప్నిక జగత్తు. భూలోక స్వర్గం – ఈ వాక్యానికి తుది మొదలు లేనట్టున్నది. అయితే అజంతా గుహలను సమీపించగానే తుది మొదలులేని జగత్తులోకే నేను ప్రవేశించాను. ఆ దృశ్యాన్ని తలచుకున్నా అంతే జరుగుతుంది.

మీకు ఇటు ఉండే కొండ – అటు ఉండే కొండ – మిమ్ము మెలికలు తిప్పించే కొండ – అన్నీ ఒక్కటే. కొండ చివర మెలికే వాఘోరానది జన్మస్థానం. నేను కొండ పై కెక్కి చూడలేదుగాని, పైన ఏడుకొలనులున్నాయట. కొలను నుంచి కొలనుకు జాలువారుతూ, 250 అడుగుల ఎత్తు నుంచి పెద్ద ధారగా వాఘోరానది కొండ దిగువకు దూకుతుంది. దూకిన తర్వాత కొండ తిరిగిన మలుపులన్నీ తానూ తిరుగుతూ, సమతల ప్రదేశానికి చేరి, కొన్ని వందల మైళ్ళు ప్రవహించి, తపతిలో కలుస్తుంది.

వాఘోరా పుట్టిన చోటనే ఉన్నాయి అజంతా గుహలు. వెతుక్కుంటూ వెడితేనే కాని, సాహసించి వెడితేనే కాని, కనబడదు ఆ చోటు. వాఘోరా జన్మస్థానం తెలుసుకోవాలనే కుతూహలంతో ఏ సాహసికుడో ఆదిలో అక్కడికి వెళ్ళాడు. ఇప్పుడు కొండను త్రవ్వి, నదిగట్టున రోడ్డు వేశారు. ఆదిలో ఇటు కొండ – అటు కొండ – మధ్యలో నది. నడవడానికి దారైనా ఉండేది కాదట. నది మధ్యనుంచే నడవవలసి వచ్చేదట. మరీ విపరీతంగా వర్షాలు కురిస్తే తప్ప నదిలో నీళ్ళు మోకాటి లోతైనా ఉండవు.


వాఘోరా పుట్టిన చోట కొండ అర్ధచంద్రాకారంగా వుంటుంది. దాని ఒక వంపులో అజంతా గుహలుండగా, రెండవ వంపుపైన వలయాకారంలో ఏదో ఒక కట్టడం కనబడుతూ ఉంటుంది. దాన్ని 'వ్యూపాయింట్" అంటారు. మధ్యకాలంలో కొన్ని శతాబ్దాల పాటు అజంతా గుహలన్న మాటే ప్రపంచానికి తెలియకుండా పోయింది. మేజర్ గిల్ అనే బ్రిటిష్ మిలటరీ ఆఫీసర్ 1819లో వేటకు వెళ్ళి, ఒక జంతువును తరుముకుంటూ కొండపైకి పోగా, ఎదురుగుండా గుబురుచెట్ల సందునుంచి – ఏదో – చెక్కడపు పని అతడి దృష్టిని ఆకర్షించిందట. సాహసించి అతడు కొండ దిగి, వాఘోరానదిని దాటి, తిరిగి కొండపైకి ఎగబాకి చూడగా, తనకు అల్లంత దూరంలో చెట్లసందుగా కానవచ్చింది అజంతా గుహలలో పదహారవదాని శిరోభాగమని తేలిందట. లోకం మరచిపోయిన అజంతా గుహలను మేజర్ గిల్ ఏ ప్రదేశం నుంచి తొలిసారిగా చూసినాడో అదే "వ్యూపాయింట్". వ్యవధి లేక నేను వెళ్ళలేదు గాని, చాలా మంది "వ్యూపాయింట్"కి వెళ్ళి, అక్కడి నుంచి అజంతా

గుహలను చూస్తూ ఉంటారు.


బౌద్ధానికి క్షీణదశపట్టిన ఘట్టంలో అజంతా గుహల అస్తిత్వాన్ని సయితం సభ్యలోకం విస్మరించింది. అయితే బందిపోటు దొంగలు మాత్రం వాటి ఉనికిని క్రీస్తుశకం తొమ్మిదవ శతాబ్ది తర్వాత ఎప్పుడో గుర్తించారు. చుట్టు ప్రక్కల ఊళ్ళను, బస్తీలను దోచుకొని, ఆ గుహలలో వారు నివసిస్తూ వుండేవారు. వంటలు చేసుకొనడానికి వారు పెట్టుకున్న పొయ్యిల పొగలతోనే పెక్కు గుహలలోని కుడ్య, చిత్రాలు మసి పూసుకొని పూర్తిగా చెడిపోయాయి. వారికి సులభంగా అందుబాటులో లేకపోవడమే రెండవ గుహలోని కుడ్యచిత్రాలు నేటికీ అంతగా చెక్కు చెదరక పోవడానికి కారణమై వుండాలి.

జవహర్‌లాల్ నెహ్రూ అజంతా గుహల గురించి ఈ క్రింది విధంగా వివరించాడు. "అజంతా మనను ఏదో స్వాప్నిక జగత్తులోకి తీసుకువెడుతుంది. అయినా, అది అతివాస్తవికమైన లోకమే". ఈ కుడ్యచిత్రాలను చిత్రించినవారు బౌద్ధ భిక్షువులు.

ఇక్కడ అందాలొలుకుతున్న స్త్రీలు అశేషంగా వున్నారు. రాకుమార్తెలు, గాయనీమణులు, నృత్యాంగనలు ఎక్కడ చూసినా స్త్రీలే. కూర్చున్నవారు కొందరు, నిలబడి ఉన్నవారు కొందరు, ముస్తాబు చేసేవారు కొందరు, ఊరేగింపుగా వెళతున్నవారు కొందరు. ఎంతో పేరొందినవారు ఈ అజంతా స్త్రీలు. బోధిసత్త్వుని అలౌకిక సుందర విగ్రహాన్ని, ఆయన అంత గంభీరమూర్తిని చిత్రించిన భక్తిశ్రద్ధలను, ఈ జగత్తును చిత్రించటంలో వీరు చూపించారు. అజంతా గుహలు మొత్తం 29. వాటిలో అయిదు బౌద్ధచైత్యాలైతే, మిగిలినవి బౌద్ధ విహారాలు. మొత్తం 29లో రెండింటినో, మూడింటినో ప్రారంభించి, పూర్తి చేయకుండానే ఆపివేశారు. ఈ రెండు మూడింటిలో తప్ప మిగిలిన అన్నింటిలోను ప్రతి స్తంభాన్ని, ప్రతి కుడ్యాన్ని, చివరికి కప్పులనైనా విడిచిపెట్టకుండా, చిత్రాలతో నింపివేశారు. కానీ ఈనాడు పదమూడు గుహలలో మాత్రమే చిత్రాలు – కాదు – వాటి శిథిలాలు మాత్రం – కానవస్తున్నాయి. చెక్కు చెదరకుండా ఎన్నో కొన్ని చిత్రాలు మిగిలింది ఒకటవ, రెండవ, తొమ్మిదవ, పదవ, పదహారవ, పదిహేడవ గుహల లోనే.



గుహల గోడలకు మట్టిగిలాబా చేసి, దానిపై పలచగా సున్నం పూసి, ఆ పూతపై దాని తడి ఆరకముందే చిత్రాలను వేశారు. వానతేమకు మట్టిగిలాబా పొక్కి, అది పొరలు పొరలుగా వూడి పోయినందున కొన్ని చిత్రాలు కాలక్రమాన నశింపు అయిపోయి వుండవచ్చును. కాలగతివల్ల ఈ విధంగా కొన్ని చిత్రాలు పోగా, గుహలలో అప్పుడు తలదాచుకొన్న బందిపోటుదొంగలు పెట్టిన పొగకు మరికొన్ని మసి పూసుకుపోయాయి. పోతే ఇటీవల కాలంలో శాశ్వత కీర్తి సంపాదన కోసం గోళ్ళతో బొమ్మలపై తమ పేర్లను కొందరు వ్రాయడం వల్ల మరికొన్ని చిత్రాలు శిథిలమై పోయాయి. కాగా,నేటికీ



నిలిచినది మొత్తంలో నూటికి ఒక వంతో, రెండువంతులో ! కొన్నాళ్ళనాడు జాగ్రత్త పడినా, ఇంతకు రెట్టింపు చిత్రాలైనా మిగిలి ఉండేవేమో! ముప్ఫయి సంవత్సరాల పాటు ఎంతో శ్రమపడి మేజర్ గిల్ ఎన్నో చిత్రాలను కాపీ చేసుకోగా, వాటిలో చాలా భాగం 1866లో లండన్‌లోని "క్రిస్టల్ ప్యాలెస్" లో అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు దగ్ధమైపోయాయి. ఇలా దగ్ధం కాగా, మిగిలిన వాటికి జాన్ గ్రిఫిల్స్ కాపీలు యెత్తగా, ఆ కాపీలలో సగభాగం సౌత్ కెన్ సింగ్టన్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో బూడిద పాలైనాయి. మేజర్ గిల్ కాపీ చేసిననాటికి ఇప్పటికంటె కనీసం రెట్టింపు చిత్రాలు ఉండి ఉండాలి. ఇప్పుడు అన్ని చిత్రాలు లేవు సరిగదా, వాటి కాపీలైనా లోకానికి దక్కకుండా పోయినయి.

ఈనాడు మిగిలిన చిత్రాలు మొత్తంలో నూటికి ఒకటి రెండు వంతులు మాత్రమే అయినప్పటికీ, అవే ఒక విశాలప్రపంచాన్ని, దాని ఆశానిరాశలతో, రాగవిరాగాలతో, ప్రేమవిద్వేషాలతో, సంతోష విషాదాలతో కళ్ళకు కట్టినట్లు చూపుతున్నాయి. ఇక అన్ని చిత్రాలూ మిగిలిఉంటే, అజంతా గుహలను చూడ్డానికి రెండు కళ్ళు చాలేవి కావేమో!

అజంతా చిత్రాలలో అధిక భాగం జాతక కథలే. సిద్ధార్థుడుగా జన్మించడానికి పూర్వం గౌతమ బుద్ధుడు కొన్ని వందల జన్మలెత్తినాడని బౌద్ధమతస్థుల నమ్మకం. పూర్వజన్మలలో బుద్ధుని జీవితచరిత్రలే జాతక కథలు. ఉత్తమ మానవ జన్మలనే కాకుండా పక్షిరాజుగా, గజేంద్రుడుగా ఎన్నెన్నో జన్మలను ఆయన యెత్తినట్లు జాతక కథలు పేర్కొంటున్నాయి. ఈ వివిధ జన్మలలో కొన్నింటికి సంబంధించిన ఘట్టాలను అజంతా చిత్రాలలో చూడవచ్చు. అయితే అజంతా చిత్రాలన్నీ జాతక కథలే కావు. జాతక కథలతో ఎలాంటి సంబంధం లేనివి ఎన్నో ఉన్నాయి. ఇంతే కాదు, వెలితిగా కాస్త చోటు కనబడితే చాలు, దానిలో ఏ ఆకునో, ఏ రెమ్మనో, ఏ పువ్వునో చిత్రించివేశారు. అదీ, ఇదీ కాకపోతే, ఆ కళాతపస్వులు తమ కుంచెతో ఇటొక గీతను, అటొక గీతను గీయడం ద్వారానే సౌందర్య సృష్టి చేశారు.

అజంతా గుహల నిర్మాణం క్రీస్తుశకం ప్రథమ శతాబ్దిలో ప్రారంభమైనట్లు ఏడవ శతాబ్ది మధ్య భాగంనాటికి సమాప్తి చెందినట్లు చరిత్రకారులు పేర్కొంటున్నారు. ఇంచుమించు ఏడు శతాబ్దాల పాటు కొనసాగిన అజంతా గుహల అలంకరణలో చివరి రెండు వందల సంవత్సరాలలో జరిగిన కృషి సర్వోత్తమమైనదని కళాభిజ్ఞులు పలుకుతున్నారు. ఫెర్గుసన్ తీర్పు ప్రకారం, పద్నాల్గవ శతాబ్దిలో ఫైజాల్, ఆర్కాన్యాజా ఇటలీలో తలయెత్తడానికి ముందు అజంతా చిత్రాలకు

సాటి రాగలిగినవి యూరప్‌లో లేవు.

అజంతా చిత్రాలలో తొణికిసలాడుతున్న భారతీయ జీవితాన్ని, సంస్కృతిని ఏ విజాతీయ చిత్రకారులూ, వారెంతటి ప్రజ్ఞాసాధకులైనా, చిత్రించగలిగి ఉండేవారు కారు. పోయినవి పోగా, ఇప్పటికి మిగిలిఉన్న అజంతా చిత్రాలను చూసి, వివిధ భారతీయ జీవితాల్ని గురించి, సంస్కృతిని గురించి, ఎన్నెన్నో విషయాలు తెలుసుకోవచ్చు. నిజానికి వాటిని మన ప్రాచీన, సాంఘిక, సాంస్కృతిక చరిత్రలుగా యెంచవచ్చు.

ప్రాచీన కాలంలో భారత సాంఘిక వ్యవస్థ ఏ రూపంలో ఉండేది? అప్పటి వృత్తులేవి? వ్యాసంగాలేవి? వినోదాలేవి? ఇలా ప్రశ్నలకు సమాధానాలు కోరితే అజంతా గుహలకు వెళ్ళాలి. ఒకప్పుడు మన దేశంలో రాణ్మందిరాలు ఏ విధంగా వుండేవి? రాజుల, రాణుల వేషభాషలేవి? రాజసభలను ఏ విధంగా తీర్చేవారు? అప్పటి సైనిక బలనిర్మాణం ఏ తీరులో ఉండేది? నాటి ఆయుధాలేవి? ఇలాంటి ప్రశ్నలకు ప్రత్యుత్తరాలను కోరితే, అజంతా గుహలకు వెళ్ళాలి. ఇంతే కాదు అక్కడికి వెడితే, మనము ఎన్నో కోణాల సమేతంగా భారత సాయుధ బలాలను సింహళంపై దండయాత్రకు చేరవేసిన భారతీయ నౌకాదళాన్ని చూడవచ్చు. వీర శివాజీ రాజ్యానికై మహాసాగరాలను దాటి వెళ్ళాడన్న భారతీయ వణిక్కులను చూడవచ్చు. పర్ష్యన్ రాయబారులకు దర్శన మిస్తున్న భారతీయ మహీపాలకులను చూడవచ్చు. అన్నింటినీ మించి గౌతమ బుద్ధుని కారుణ్య సందేశం కేవలం మానవుని వికాసానికే కాక పశుపక్ష్యాదుల జీవితాన్ని సయితం ఎంత పునీతం చేసిందో, తేజోవంతం చేసిందో చూడవచ్చు. అందువల్ల అజంతా గుహలు యాత్రాస్థలం కావలసింది చిత్రకారులకే కాదు, భారతీయ చరిత్రలో, విజ్ఞానంలో, సంస్కృతిలో, భవితవ్యంలో శ్రద్ధాభక్తులు గలవారందరికీ.

© SCERT
Not to be republished

### రచయిత పరిచయం



నార్ల వేంకటేశ్వరరావు,

నార్ల వేంకటేశ్వరరావు, 1908 డిసెంబర్ ఒకటవ తేదీన కృష్ణాజిల్లాలోని 'కవుతరం' అనే గ్రామంలో జన్మించారు. ఈయన రష్యన్ కథలు (అనువాద రచన), నరకంలో హరిశ్చంద్రుడు (నాటకం) నార్లవారి మాట (పద్యకావ్యం), మొదలైన గ్రంథాలు రచించారు. ఈయన పత్రికాసంపాదకుడు, కవి, విమర్శకుడు. నిరంతరం సమాజశ్రేయస్సు కోసం కృషిచేసిన మేధావి. నార్లవారి రచన సరళమైన శబ్దాలతో, సొగసైన భావాలతో సుందరశైలిలో సాగుతుంది.

### ప్రక్రియ - యాత్రారచన

రచయిత తాను చూసిన ప్రదేశాన్ని గురించి వర్ణించే రచనే యాత్రారచన. దీనిలో ఆ ప్రదేశం ప్రత్యేకత, ప్రకృతి రామణీయకత, చరిత్ర వంటి అంశాలుంటాయి. రచయిత ఆత్మాశ్రయ శైలిలో భావాలను తెలియజేస్తాడు.

## ఇవి చేయండి

### I. వినడం - మాట్లాడడం

1. మీరు ఏదైనా ప్రదేశాన్ని చూడడానికి వెళ్ళారా? ఆ ప్రదేశాన్ని గురించి చెప్పండి.
2. పాఠంలోని ఒక అంశాన్ని గ్రహించి అది మీకు ఎందుకు నచ్చిందో చెప్పండి.
3. పాఠం చదువుతుంటే మీకు వచ్చిన ఆలోచనలను, అనుభూతిని వివరించండి.

### II. చదవడం, అవగాహన చేసుకోవడం

**1. పాఠం చదవండి. వర్ణనతో కూడి ఉన్న ఐదు వాక్యాలను గుర్తించండి. వాటి కింద గీత గీయండి. చదివి వినిపించండి.**

**2. కింద సూచించిన పదాలతో మొదలయ్యే పేరాలు చదివి, సరిపోయే శీర్షికలను సూచించండి ?**

| పేరా | శీర్షిక |
|---|---|
| ఇటీవలనే ...... | |
| వాఘోరానది పుట్టి ... | |
| గుహలగోడలకు ... | |
| అజంతా గుహల నిర్మాణం ... | |
| ఇక్కడ అందాలొలుకు ... | |

© SCERT not to be republished

**3. కింది పేరా చదివి పట్టికను పూరించండి.**

అజంతా గుహలు మొత్తం 29. వాటిలో 5 బౌద్ధ చైత్యాలైతే మిగిలినవి బౌద్ధ విహారాలు. మొత్తం 29లో మూడింటిని ప్రారంభించి పూర్తి చేయకుండానే ఆపివేశారు. ఇవి తప్ప మిగిలిన అన్నింటినీ చిత్రాలతో నింపివేశారు. కాని ఈనాడు పదమూడు గుహలలో మాత్రమే ఆ చిత్రాల శిథిలాలు కానవస్తున్నాయి. చెక్కు చెదరకుండా ఎన్నో కొన్ని చిత్రాలు మిగిలింది ఒకటవ, రెండవ, తొమ్మిదవ, పదవ, పదహారవ, పదిహేడవ గుహలలోనే.

**అజంతా గుహలు**

| ప్రారంభించి వదలిన గుహలు | చెక్కుచెదరని చిత్రాలున్న గుహలు | శిథిలావస్థలో చిత్రాలున్న గుహలు | పూర్తిగా కనుమరుగైన చిత్రాల గుహలు | మొత్తం గుహలు |
|---|---|---|---|---|
| | | | | |

**4. పాఠం ఆధారంగా కింది ప్రశ్నలకు సమాధానాలు రాయండి.**

(అ) నార్ల వేంకటేశ్వరరావు గురించి రాయండి.

(ఆ) అజంతా గుహలు ఎక్కడ ఉన్నాయి? వాటి విశిష్టతను తెలపండి.

(ఇ) వాఘోరా నది గురించి రాయండి.

(ఈ) నేడు అజంతా గుహలు ఏ స్థితిలో ఉన్నాయి?

(ఉ) అజంతా శిల్పాలలో ఏమేమి ప్రతిబింబిస్తాయి?

## III. స్వీయరచన

**1. కింది ప్రశ్నలకు ఐదు వాక్యాలలో సమాధానాలు రాయండి.**

(అ) మేజర్ గిల్ వేటకు వెళ్ళి తొలిసారిగా అజంతా గుహలను దర్శించినట్లు చదివారు కదా! దీనివల్ల మన దేశానికి జరిగిన మేలు ఏమని భావిస్తున్నారో రాయండి.

(ఆ) జవాహర్‌లాల్ నెహ్రూ "అజంతా మనను ఏదో స్వాప్నిక జగత్తులోకి తీసుకువెళుతుంది" అన్నాడు. ఆయన ఈ మాట ఎందుకు అన్నాడో రాయండి.

(ఇ) "ప్రాచీన కాలంలో భారత సాంఘిక వ్యవస్థ ఏ రూపంలో ఉండేది? అప్పటి వృత్తులేవి? ఈ ప్రశ్నలకు సమాధానాలు కోరితే అజంతా గుహలకు వెళ్ళాలి" ఇలా అనడం వెనుక నార్ల వేంకటేశ్వరరావుగారి భావం ఏమై ఉంటుందో రాయండి.

(ఈ) "అజంతా గుహలను చూడడానికి రెండు కళ్ళు చాలవు" అని రచయిత అన్నాడు కదా! ఇలా 'రెండు కళ్ళు చాలవు' అనే మాటను ఇంకా ఏయే సందర్భాలలో వాడతారు? కొన్నింటిని తెలపండి.

**2. కింది ప్రశ్నలకు పది వాక్యాలలో జవాబులు రాయండి.**

(అ) ప్రస్తుత పాఠ్యభాగం ద్వారా అజంతా గొప్పతనాన్ని వివరిస్తూ ఒక వ్యాసం రాయండి.

(ఆ) రచయిత అజంతా చూసి అక్కడి విశేషాలు రాశాడు కదా! అలాగే మీరు చూసిన లేదా తెలిసికొన్న ఒక దర్శనీయ స్థలానికి సంబంధించిన విషయాలు రాయండి.

## IV. పదజాలం

**1. కింది వాక్యాలలోని జాతీయాలకు సరిపోయే అర్థం గ్రహించి సరైన సమాధానం కింద గీత గీయండి.**

(అ) అజంతా గుహలోని కుడ్యచిత్రాలు నేటికీ <u>చెక్కు చెదరలేదు</u>.

i) చెదిరిపోలేదు, ii) ఏమీ పాడుకాలేదు, iii) చెక్కబడలేదు iv) శిథిలం కాలేదు.

(ఆ) దొంగలు అజంతా గుహలో <u>తలదాచుకున్నారు</u>.

i) తలను దాచుకున్నారు, ii) వస్తువులు దాచుకున్నారు, iii) ఆశ్రయం పొందారు iv) నివసించారు.

(ఇ) అజంతా చిత్రాలు భారతీయ సంస్కృతిని <u>కళ్ళకుకట్టినట్లు చూపుతున్నాయి</u>.

i) కళ్ళకు కట్టుకున్నట్లు చూపుతున్నాయి ii) కళ్ళ ముందు నిజంగా ఉన్నట్లు చూపుతున్నాయి

iii) చాలా మంచి విషయాలు చూపుతున్నాయి iv) కళ్లు చెదిరేట్టుగా ఉన్నాయి.

**2. కింది వాక్యాలలో గీత గీసిన పదాన్ని మరో సందర్భానికి అన్వయించి వాక్యాలు తిరిగి రాయండి.**

ఉదా : అనంతాకాశంలోని నక్షత్రాలను పరిశీలించి ఆ <u>అనుభూతిని</u> చెప్పగలమా?

మంచి కథను చదివితే గొప్ప అనుభూతి కలుగుతుంది.

అ. భారతీయ చిత్రకళ <u>మహోన్నత శిఖరాలను</u> అధిరోహించింది.

ఆ. చెక్కడపు పని మేజర్ గిల్ <u>దృష్టిని ఆకర్షించింది</u>.

ఇ. <u>కాలగతిలో</u> కొన్ని చిత్రాలు నశించాయి.

ఈ. ఈ <u>కుడ్యచిత్రాలను</u> చిత్రించిన వారు బౌద్ధ భిక్షువులు.



© SCERT not to be republished

3. కింది వాక్యాలలోని పర్యాయపదాలను గుర్తించి వాటి కింద గీత గీయండి.

(అ) హృదయాన్ని కదలించే అనుభూతిని, ఆ ఎదలోని భావాలను సులభంగా వర్ణించలేం.

(ఆ) వాఘోరానది కొండల చుట్టూ తిరుగుతూ ప్రవహించింది. ఆ వాహిని ప్రవహించే దృశ్యం మనోహరం.

(ఇ) పడమటిగాలి సన్నగా వీస్తూంది. - పశ్చిమదిశ వైపు ఒక సుందరమైన తోట ఉంది.

## V. సృజనాత్మకత -

అజంతా చిత్రాల పాఠంలో అజంతా గుహల చరిత్ర, దాని విశేషాలూ చదివారు కదా! అలాగే ప్రతి గ్రామానికీ ఒక చరిత్ర కానీ, విశేషం కానీ ఉండవచ్చు. మీ గ్రామానికి గల ప్రత్యేకతను గురించి లేదా మీకు దగ్గరలోని ఇతర గ్రామాల ప్రత్యేకతను వర్ణిస్తూ రాయండి. ఆ వివరాలతో ఒక బ్రోచర్ తయారు చేయండి.

(లేదా)

చుట్టూ ఎత్తైన కొండలు, ఆ కొండలనుండి జలజలా జాలువారే జలపాతాలు, పచ్చని ప్రకృతి శోభ, పక్షుల కిలాకిలారావాలతో ఆ ప్రదేశం ఎంతో సుమనోహరంగా ఉంది ...... ఇలా ఏదైనా ఒక ప్రాంతాన్ని గురించి వర్ణిస్తూ రాయండి.

## VI. ప్రశంస

మీరు చూసిన ఒక దర్శనీయ స్థలాన్ని కొనియాడుతూ 'నీవు కూడా తప్పక చూడవలసింది' గా తెలుపుతూ మీ మిత్రుడికి లేఖ రాయండి.

(లేదా)

పాఠ్యభాగంలో నెహ్రూ రెండే రెండు చిన్నవాక్యాలతో ఎంతో భావం వచ్చేలా అజంతా గొప్పతనాన్ని తెలిపాడు కదా!

ఏదైనా ఒక వస్తువునో, ప్రదేశాన్నో చూసినప్పుడు 'అది ఎలా ఉంది' అని ఎవరైనా అడిగితే సమాధానం ఒక్క మాటలో చెప్పాల్సి రావచ్చు. అలాగే ఒకే ఒక్క వాక్యంలో అజంతా గుహల గురించి మీ అభిప్రాయం రాయండి.

## VII. భాషను గురించి తెలుసుకొందాం.

1. కింది వాక్యాలను పరిశీలించి, మార్పులను గమనించండి.

(అ) సంఘసంస్కర్తలు దురాచారాలను నిర్మూలించారు.

(ఆ) సంఘసంస్కర్తల చేత దురాచారాలు నిర్మూలించబడ్డాయి.

పై రెండు వాక్యాల అర్థం ఒక్కటే. కానీ వాక్య నిర్మాణంలో భేదం ఉందని గమనించారు కదా!

రెండు వాక్యాల మధ్య భేదం ఏమిటి ?

1. సంఘ సంస్కర్తలు దురాచారాలను నిర్మూలించారు. అనే ఈ మొదటి వాక్యంలో కర్తకు ప్రాధాన్యం ఉంది. అంటే క్రియ కర్తను సూచిస్తుంది. కర్మకు ద్వితీయా విభక్తి చేరి ఉంది. ఇలాంటి వాక్యాన్ని 'కర్తరి వాక్యం' అంటారు.

ఇక సంఘ సంస్కర్తల చేత దురాచారాలు నిర్మూలించబడ్డాయి. అనే రెండవ వాక్యంలో (i) కర్తకు తృతీయా విభక్తి ఉంది (ii) క్రియకు "బడు" అనే ధాతువు చేరింది. (iii) క్రియ - కర్మ ప్రధానంగా ఉంది.

వాక్యంలో క్రియకు 'బడు' ధాతువు చేరి, కర్తకు తృతీయా విభక్తి చేరే వాక్యాన్ని "కర్మణి వాక్యం" అంటారు.



© SCERT not to be republished

2. కింది కర్తరి వాక్యాలను కర్మణి వాక్యాలుగా రాయండి.

(అ) వాల్మీకి రామాయణాన్ని రచించాడు.

(ఆ) ప్రజలు శాంతిని కోరుతున్నారు.

3. కింది కర్మణి వాక్యాలను కర్తరి వాక్యాలుగా రాయండి.

(అ) లైబ్రరీ నుంచి తెచ్చిన పుస్తకం నాచేత చదవబడింది.

(ఆ) నాచే రచింపబడిన గ్రంథం నేతాజీ చరిత్ర.

4. కింది సమాసపదాలకు విగ్రహవాక్యాలు రాసి సమాసం పేరు తెలపండి.

| | సమాస పదం | విగ్రహ వాక్యం | సమాసం పేరు |
|---|---|---|---|
| ఉదా – | నదిగట్టు | నది యొక్క గట్టు | షష్ఠీతత్పురుష |
| | (అ) అజంతాస్త్రీలు | | |
| | (ఆ) ప్రకృతి సౌందర్యం | | |
| | (ఇ) నదీప్రవాహం | | |
| | (ఈ) మానవసమాజం | | |

5. కింది విగ్రహవాక్యాలకు సమాస పదాలు రాసి దాని పేరును తెలపండి.

| | విగ్రహ వాక్యం | సమాస పదం | సమాసం పేరు |
|---|---|---|---|
| ఉదా – | (అ) గుహల యొక్క గోడ<br>(ఆ) భారతీయుల యొక్క సంస్కృతి<br>(ఇ) కొండ యొక్క మలుపు | | |

## ప్రాజెక్టు పని

1. మీ జిల్లాలోని దర్శనీయ స్థలాలు, పర్యాటకప్రదేశాల చిత్రాలు సేకరించండి. వీటి వివరాలు రాయండి. వీటన్నిటితో ఒక సంకలనం తయారు చేసి ప్రదర్శించండి.

## నేనివి చేయగలనా ?

1. అనుభూతులను, ఆలోచనలను వివరించగలను. ఔను / కాదు
2. పేరాలకు తగిన శీర్షికలు రాయగలను. ఔను / కాదు
3. అజంతా గొప్పదనాన్ని / సందర్శించిన స్థలం గొప్పదనాన్ని వివరిస్తూ సొంతమాటల్లో రాయగలను. ఔను / కాదు
4. నేను చూసిన ప్రదేశాన్ని గురించి వర్ణించగలను. బ్రోచర్ తయారు చేయగలను. ఔను / కాదు

ఉలిదెబ్బలు తిన్నప్పుడే రాయి శిల్పంగా మారుతుంది. ఎదురుదెబ్బలు తిన్నప్పుడే విజయం ప్రాప్తిస్తుంది.


ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారిచే ఉచిత పంపిణీ
© SCERT not to be republished